# మంచు మనిషి

పూర్వం రష్యాదేశంలో, ఒక పల్లెటూళ్లో ఒక రైతు ఉండేవాడు. అతనికి ఓల్గా అనే చక్కని కూతురుఉండేది. ఓల్గా చిన్న పిల్లగా వుండగానే ఆమెతల్లి చనిపోయింది. తండ్రి కొంతకాలానికి మళ్లీ పెళ్లిచేసుకున్నాడు. కొత్తభార్యకు ఒక కూతురుపుట్టింది. ఆ పిల్లపేరు వేరా.

ఓల్గాను సవతి తల్లి చాలా బాధించేది ఓల్గా చక్కని చుక్క. వేరా బక్క నక్కలాగ కర్రికుక్కలాగా ఉండేది. ఓల్గా అందానికి తోడు, మంచి తెలివితేటలు గల పిల్ల; ఆమె స్వభావంకూడా చాలా మంచిది. వేరా తల్లిలాగే అనాకారి, ముక్కోపి ఊళ్లోవాళ్లంతా ఓల్గానే ప్రేమించేవారు. వేరాను ఎవరూ దగ్గిరికి తీసేవారుకాదు. అందుచేత సవతితల్లికి ఓల్గాఅంటే మహాకోపంగా ఉండేది. వేరాకి కూడా ఓల్గామీద అసూయగానే ఉండేది. ఓల్గా తనకంటె పెద్దదైనా ఆమె మంచితనాన్ని అనరాగా తీసుకొని అప్పుడప్పుడు ఆమెను కొట్టేదికూడాను. సవతితల్లి భయంమూలాన ఓల్గా, పాపం నోరెత్తకుండా అన్నీ సహించి వూరుకొనేది.

ఒక్కొక్క ఏడే గడుస్తున్నకొద్దీ ఓల్గా అందం శుక్లపక్ష చంద్రుడిలా వృద్ధి అవుతోంది. ఇక సహించలేక సవతితల్లి భర్తతో చెప్పివేసింది. ఓల్గా ఒక్క క్షణమైనా ఇంట్లో ఉండడానికి వీల్లేదని, ఆమెను ఏ అడవిలోనైనా దిగవిడిచిరమ్మనీ.

## సామగానం సరస్వతీదేవి

పడుచుపెళ్లాం నోటికి వెరిచే ముసలాడు కాళ్లావేళ్లాపడి బ్రతిమాలాడు ఓల్గాను నిష్కారణంగా హింసించవద్దనీ, యింట్లోనే వుండనిమ్మనీ. కాని ఎంత వేడినా ఏమీ ప్రయోజనం లేకపోయింది. విధిలేక వృద్ధుడు గుర్రాల బగ్గి తెచ్చి, వాకిట్లోపెట్టి, తన కన్నతల్లిని ఎక్కమన్నాడు; — కారడవుల్లోకి తీసుకుపోయి వదిలిపెట్టి రావటానికి.

కడుపుతీపు వదులుకోలేని ఆ తండ్రి, కన్నబిడ్డని ఎముకలు కొరికే చలిలో చావుకి ఒప్పగించి రాలేక, అడివిమార్గానబడి ఎంతో దూరం బండిని నడిపించుకుపోయాడు; బొత్తిగా ఆరుబయలు ప్రదేశంకాకుండా, కాస్తంత తల దాచుకోవటానికి వీలుగా ఏదైనా చెట్టు తొర్ర కనిపిస్తుందేమోనని చాలా వెతికాడు. వెతగ్గా, వెతగ్గా చివరికొకచోట, అడివిలో కట్టెలు కొట్టేవాళ్లు తమకోసం వేసుకొని వదిలిపెట్టిన పూరిపాక ఒకటి కనిపించింది.

ఆ తండ్రికి బ్రహ్మానందమైపోయింది. తండ్రీకూతుళ్లు యిద్దరూ బండిదిగి పాకలోకివెళ్ళారు. అమ్మాయిని అక్కడే వుండమని, తండ్రి గబగబాపోయి పెద్దపెద్ద కొయ్యదుంగలు కొన్నికొట్టి తీసుకువచ్చి పాకలో ఒకమూల నెగడువేశాడు. బండిలో తెచ్చిన పెద్ద గంజిబాన, దూదీ రాట్నం తీసుకొచ్చి పాకలో పెట్టాడు.

"అమ్మాయి! ఇక మరి నేను వెళ్తాను ... చూడు — నెగడులో నిప్పుమాత్రం ఆరిపోకుండా ఎప్పటికప్పుడు కొత్తకట్టెలు పడేస్తుండు. ఆకలైనప్పుడు కుండలో గంజి కాస్త వెచ్చబెట్టుకు తాగు బయట చూశావా-- మంచు ఎంతదట్టంగా పడుతోందో? ఎంతఅవసర మనిపించినా సరే పాకలోనుంచి మాత్రం బయిటికి వెళ్లకు మళ్లా నేను రేపువుదయమేవచ్చి నువ్వు ఎలా వున్నావో చూసిపోతాను, తల్లీ!" అంటూ గుడ్లల్లో నీళ్లు కుక్కుకొంటూ వెళ్లలేక వెళ్లాడు ముసలాడు.

తండ్రి వెళ్లాక ఓల్గా ఒంటరిదైపోయింది. విధికి తలఒగ్గిన ఓల్గా నెమ్మదిగా రాట్నం మీద నూలు తీస్తూ కూర్చుంది. అలా చీకటిపడే దాకా నూలుతీస్తూనేవుంది అప్పుడు లేచి కాస్త గంజితీసి నెగడుమీద వెచ్చబెట్టింది; ఆ పూటకి ఆ కాస్త తాగి కళ్లు మూసుకు పడుకుందామని.

గంజికాగే సమయానికి తలుపు

# ★ మంచు మనిషి ★

మీద ఎవరో తట్టిన చప్పుడు అయింది. "కాకులుదూరని యీ కారడవిలో, యింత చీకటిపడ్డాక ఎవరు చెప్మా యిలావచ్చి తలుపు కొట్టుతున్నారని" ఆ పిల్ల కాస్సేపు విస్తుపోయింది. అలా ఆలోచిస్తూనే పోయి తలుపు తెరిచింది.

గుమ్మంలో గమ్మత్తైన మానవ ఆకారం నిలబడివుంది మంచుతో చేసిన ముసలాడు ఎవరో ఊడిపడ్డట్లున్నాడు. అతని జుట్టు చివరల నుంచీ, గడ్డంమీద వేళ్ళకొనలమీద అంతటా గడ్డకట్టిన మంచు దట్టంగా కప్పేసింది ఆ ఆకారాన్ని చూడగానే పసిపిల్ల కొంచెం దడుచుకొంది కాని, అంతలో మళ్ళీ ధైర్యం తెచ్చుకొని "ఎవరు మీరు" అని అడిగింది.

"నేనా?— నేనూ— మంచు మనిషినిలే లోపలికి రావచ్చా?" అని అడిగాడు ఆ తెల్ల మనిషి.

"రండి లోపలికి వచ్చి కూర్చోండి" అని ఓల్గా ఆయన్ను సవినయంగా లోనికి ఆహ్వానించింది

మంచుమనిషి కదిలి పాకలో కాలుపెట్టాడు. అతడు కాలుపెట్టగానే పాకలో గాలిఅంతా గడ్డకట్టుకుపోయినట్లయింది. ఆ చలికి పాపం ఓల్గా కాళ్ళూ, చేతులు కొంకర్లుపోవటం మొదలుపెట్టాయి; దవడలు దడదడ లాడుతున్నాయి అయినప్పటికీ యింట్లోకి వచ్చిన పెద్దమనిషికి తనుపడేబాధ తెలియనీయకుండా వుండాలని జాగర్తగా వున్నది.

"గంజి ఏమైనా పుచ్చుకొంటారా?" అని మర్యాద పుట్టిపడేలా అడిగింది

"ఉంటే కాస్త యియ్యి తల్లీ" అన్నాడు మంచుమనిషి.

ఇద్దరూ గంజి తాగాక మంచు మనిషి సావకాశంగా కూర్చుని ఉత్తర ధృవ ప్రాంతంలోని తన నివాసాన్ని గురించీ, అక్కడ వాతావరణాన్ని గురించి ఓల్గాకి అనేక విశేషాలు చెప్పాడు. అక్కడ ఎండ వెన్నెలలాగా చల్లగా వుంటుందట మంచు కరగటం అన్నది సంవత్సరంలో ఎన్నడూ జరుగదట

అవన్నీ చెప్పి చెప్పి, చివరికి తానిక పోతానన్నాడు అప్పటికైనా అతను పోతాననటం మంచిదే అయింది. అతనింకా అలాగే మరికొంతసేపు కూర్చొనివుంటే అతనిమీదా అలుముకొనే మంచుతెరల మూలంగా ఓల్గా చలికి బిర్ర బిగుసుకుపోయేదే!

గుమ్మం దాటుతూ "నువ్వు చాలా బుద్ధిమంతురాలివిలా వున్నావు అమ్మాయ్! నీ యీడు పిల్లలు ఎవ్వరూ నేను చెప్పే యీ మాదిరి కబుర్లు వినరు. నువ్వు ఎంత ఓపిగ్గా విన్నావ్! బాగుంది. నువ్వు చాలా బుద్ధిమంతురాలివి. మంచి పిల్లకి మంచి కానుక యివ్వాలి. నువు రేపు పొద్దున నిద్దరలేవగానే వాకిట్లోకి వచ్చి చూడు అక్కడ నీకోసం మంచి బహుమానం ఒకటి కాచుకొని వుంటుంది!" అంటూనే ఆ మంచుమనిషి గబగబా అడుగులువేస్తూ పోయి చెట్లలో కలిసిపోయాడు.

అతను మనిషి కనిపించకుండా పోయినా, చాలాసేపటివరకు దారిపొడుగునా అతను వేస్తున్న చిటికెల చప్పుడు వినిపిస్తూనేవుంది ఓల్గా ఆ చప్పుడు వింటూ చాలాసేపు గుమ్మంలోనే వుండిపోయింది కొద్దిసేపటికి లోపలికి వచ్చి, యిందాకటి నుంచి చలితో చచ్చుబడిపోయిన కాళ్ళని చేతులనీ కాచుకొంటూ నెగడు దగ్గరగా కూర్చున్నది ఆ వెచ్చదనానికి, ఆ హాయికి ఆ అమ్మాయి కళ్ళమీదికి నిద్రవచ్చేసి, ఆ పిల్ల అక్కడే ఒకమూలగా పడుకొని నిద్రపోయింది

తెల్లవారింది ఓల్గాకి మెళుకువ వచ్చి, కళ్ళు తెరిపడి పడ్డాయి.




"అబ్బాయ్! మీ నాన్నగారు ఇంట్లో వున్నారా!"

"ఏమండీ? ఎందుకు"

"నా బాకీ ఇవాళ ఇస్తానన్నారు కదా! అందుకని వచ్చేను"

"అయితే మా నాన్నగారు ఇంట్లో లేరండి.

— ఎస్. బాలకృష్ణారావు, జయపురం

వెంటనే ఆ అమ్మాయి ఒక్క వుదుటున లేచి వాకిలి దగ్గిరకు వెళ్లి చూసింది.


అక్కడ కనిపించిన దృశ్యంతో అమ్మాయికళ్లు జిగేల్ మన్నాయి. ఆ పూరిపాకచుట్టూ మాంచి అరేబియా గుర్రాలు దాదాపు యిరవైదాకావుంటాయి-- నిలబడి వున్నాయి. ఒక్కొక్క గుర్రం నడ్డి మీదనూ రెండేసి పెద్ద పెద్ద గోనె సంచులున్నాయి. ఒక్కొక్క సంచిలోనూ బోలెడంత బంగారం సుద్దలు సుద్దలుగా పడివుంది.

ఆ పిల్ల అలా ఆశ్చర్యంగా చూస్తూ అక్కడే చాలాసేపు నిలబడిపోయింది. ఈలోగా కూతురు ఎల్లావుందో చూసిపోదామని తొందర తొందరగా ఆమె తండ్రి గుర్రపు బగ్గీమీదచక్కావచ్చాడు. ఆయనకూడా ఆ దృశ్యాన్ని చూసి తన కళ్లను తానే నమ్మలేకపోయాడు. తండ్రిరాకను గమనించిన ఓల్గా, పట్టలేని ఆనందంతో చెంగుచెంగున దూకుతూ పోయి ఆయనను కౌగలించుకొన్నది.

తండ్రీ కూతుళ్లు యిద్దరూ వెంటనే యింటికి తరలిపోయారు. కూతురినీ, బంగారపు సంచులు మోసుకొస్తున్న ఆ యిరవై గుర్రాలనీ వెంటబెట్టుకొస్తున్న ముసలాయనను చూసి సవితితల్లి నఖశిఖపర్యంతం విషజ్వాలలు కక్కింది. ఆవిడ కోపం నిప్పులు చెరిగింది.

జరిగిందంతా విన్నమీదట మర్నాడు తన కడుపునపుట్టిన బిడ్డ వేరాని అడివికితీసుకుపోయి వదలిపెట్టి వస్తారా లేదా అని మొగుణ్ణి వేధించుకుతిన్నది. "ఈ చమురుకాళ్ల పెద్దమ్మ ఓల్గాకంటే నా కూతురు వేరా వేయిరెట్లు తెలివిగలది. దీన్నిచూస్తేనే చాలు--ఆ దిక్కుమాలిన మంచుమనిషి మనస్సు మంచుకరిగినట్లు కరిగిపోతుంది. ఈ దరిద్రపు మొహానికి యిచ్చినదానికంటే కనీసం రెండు రెట్లు అయినా ఎక్కువబంగారం యిస్తాడు-- నా కన్నతల్లికి, నా వరాల మూటకు"అని తెగ మురిసిపోయింది, చప్పనాతి సవితి తల్లి.


ఓల్గామీద వున్నకోపంతో కుతకుత లాడిపోతున్న వేరాని వెంటబెట్టుకొని ముసలాయన మర్నాడు





పసిడివెన్నెల

—ఫోటో: యస్. రామకృష్ణ, మాయవరం.



బోసినవ్వులు

—ఫోటో. జి రామమూర్తి, మద్రాసు.

## మంచుమనిషి

పొద్దునే అదే అడివికి తీసుకెళ్లి అదే పాకలో ప్రవేశపెట్టాడు. ఈసారికూడా ఒక బానెడుగంజి, బుట్టెడు ఏకులు ఒక రాట్నం పాకలోపెట్టి తిరిగివచ్చాడు.

ఒంటరిగా మిగిలిపోయిన వేరా మంచుమనిషి ఎప్పుడొస్తాడా, ఎప్పుడొస్తాడా అని మహా ఆవేదన పడిపోయింది. గబగబా యింత గంజి తీసి పొయ్యిమీద పెట్టింది. అది బాగా వెచ్చబడే సమయానికి తలుపుమీద ఎవరో తట్టిన చప్పుడు అయింది. ఆ అమ్మాయిపోయి తలుపు తెరిచింది, ఇదివరకటిలాగానే మంచు మనిషి ప్రత్యక్షమైనాడు.

"లోపలికి రావచ్చా?" అని అడిగాడు.

"ఓ! రావచ్చు. మహాబాగా రావచ్చు. కాని ఒక్కషరతు మాత్రంవుందండోయ్ నేనేమన్నా తెలివి తక్కువదాన్ని అనుకొంటున్నారేమో. అదేం కుదరదు. ఆ తెలివితక్కువదద్దమ్మ - మా సవితి అక్కయ్యలేదూ? — ఓల్గా! దానికిచ్చినదానికంటె కనీసం రెండురెట్లు అయినా ఎక్కువ బంగారం నాకు యివ్వాలి. తెలిసిందా?" అని అడిగేసింది.

మంచుమనిషి ముసిముసినవ్వులు నవ్వుతూ లోనికి వచ్చాడు. అతడు వచ్చి రాగానే పాకలో గాలిఅంతా

గడ్డకట్టుకుపోయింది. నరాలుకొరికే ఆచలిబాధను ఆగలేక వేరా ఒక్కసారిగా నెగడుదగ్గిరకు పరిగెత్తుకుపోయి వొళ్లు కాచుకోవటం మొదలు పెట్టింది. అంతే కాదు- పెద్దమనిషి ఎవరో వచ్చారన్న ఆలోచన అయినా లేకుండా ఆయన ఎదురుగుండానే గంజి అంతా తేసే తాగెయ్యటం మొదలుపెట్టింది.

"నాకు కొంచెంగంజిపొయ్యవా, వేరా?" అని అడిగాడు మంచుమనిషి - అక్కడికీ నోరు తెరచి.

"ఏం? నీకు గంజిపొయ్యాలని ఎక్కడుందేం? అసలే యీకాసింత గంజి నాకే చాలదు. అదీ కాక - నువ్వువచ్చి యిక్కడ చలి ఎక్కువ చేసి నన్ను యింత బాధ పెట్టింది కాక, పైగా గంజికూడా పొయ్యమంటున్నావా? పోవయ్యా! ఫో!!" అంటూ నెగడిదిలించేసింది వేరా.

దాంతో మంచుమనిషికి మాంచి కోపం వచ్చేసింది. కోపం అయితే వచ్చిందికాని నిప్పుదగ్గరగా కూర్చున్న వేరా దగ్గిరకి ఆయన పోలేకపోయాడు; - పోతే ఆ వేడికి మంచుమనిషి పూర్తిగా కరిగిపోతాడు. అందుకని కొంచెం దూరంగానే నిలబడి అక్కడ ఒక మూలగా గుట్టపోసివున్న కట్టెపుల్లల్లోనుంచీ ఒక్కటొక్కటే తీసి ఆ అమ్మాయిమీదికి విసరటం మొదలు పెట్టాడు.

వర్షపు చినుకుల్లా మీదిమీదికి వచ్చిపడుతున్న కట్టెపుల్లల బారినుంచి తప్పించుకోవాలని ఆ పిల్ల యింకా యింకా మూలకు జరిగింది కాని, ఎంత మూలకుపోయినా లాభం లేకపోయింది. మంచుమనిషి విసిరిన ప్రతిపుల్లా ఆ అమ్మాయికి సూటిగావచ్చి తగిలింది. ఆదెబ్బలకి సగంచచ్చి వేరా శవంలా నేలమీద పడిపోయింది. మంచు మనిషి కోపం కొంతమటుకు చల్లారింది. చిటికెలు వేసుకొంటూ చెట్లలో కలిసి ఎక్కడికో వెళ్ళిపోయాడు.

మరునటి రోజు పుదయాన్నే వాళ్ళనాన్న వచ్చాడు; వేరానీ, ఆవిడగారు సంపాదించిన బహుమానాలనీ (!) ఇంటికి తరలించుకుపోవటానికి.

తీరా వచ్చిచూస్తే - గుర్రాలూ లేవు; బంగారు నంములూ లేవు. పిల్లమాత్రం సగం చచ్చిపడివుంది. దిక్కుతోచక ఆ తండ్రి పిల్లని చంకను ఎత్తుకుపోయి బండిలో పడుకోబెట్టి ఇంటికి తీసుకు వెళ్లాడు.

జరిగిందంతా వినేసరికి సవితి తల్లికి మనిషికీ మించినకోపం వచ్చేసింది. ఆ కోపతాపానికి తట్టుకోలేక ఆవిడ గుండె కాస్తా గుటుక్కున ఆగిపోయింది. చెట్టంతమనిషీ నేలకొరిగి ఆవిలించి చచ్చింది.

ఓల్గాకి యిప్పుడు ఎనలేని సంపదలు, ఎక్కడలేని ఐశ్వర్యాలూ వచ్చాయి. ఒకానొక రాజకుమారుడు ఆఅమ్మాయినిచూచి మోహించినవాడై, మంచి ముహూర్తాన ఆమెను పెండ్లాడాడు. పాణిగ్రహణానంతరం ఓల్గా అత్తవారింటికి వెళ్ళిపోయింది. వెళుతూ వెళుతూ తండ్రినీ, సవితి చెల్లెలు వేరానీ తనతోపాటు తీసుకుపోయి ఆ రాజభవనాలలో అట్టే పెట్టి సకలోపచారాలూ చేయించేది. అందరూ అక్కడ చాలాకాలం హాయిగా వున్నారు.

(రష్యన్ కథ ఆధారంగా) ★

